సాక్షి
ఏలూరు
మంగళవారం । 8 । జూలై । 2025



పుణ్యక్షేత్రాల వైపు ఆర్టీసీ అడుగులు

ఆర్టీసీ ఆదాయం పెంచుకునే మార్గంలో పుణ్యక్షేత్రాల వైపు అడుగులు వేస్తోంది. ప్రముఖ పుణ్యక్షేత్రాలకు బస్సు సర్వీసులను నడుపుతోంది. 8లో ▸



నిట్‌లో సీట్లు ఫుల్

జోసా కౌన్సెలింగ్‌లో తొలి విడతలోనే తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్‌లో ఉన్న 480 సీట్లకు అప్షన్లను విద్యార్థులు ఎంపిక చేసుకున్నారు. 8లో ▸



ట్రిపుల్ ఐటీలో కొరవడిన భద్రత

నూజివీడు ట్రిపుల్ ఐటీలో భద్రత కొరవడింది. శ్రీకాకుళం ఇంజినీరింగ్ విద్యార్థులు ఉంటున్న హాస్టల్ గదులను అగంతకులు లూటీ చేశారు. 8లో ▸

అపర భగీరథ.. అభివృద్ధి ప్రదాత

రాజన్నా.. నిను మరువలేమన్నా..

- మెట్ట సస్యశ్యామలంలో రాజన్న ముద్ర
- నూజివీడులో ట్రిపుల్‌ఐటీతో విద్యావిప్లవం
- తమ్మిలేరు రిటైనింగ్ వాల్‌కు చర్యలు
- గిరిపుత్రులకు పోడు భూముల పంపిణీ
- ఏలూరు సమగ్రాభివృద్ధికి బీజం
- నేడు వైఎస్సార్ జయంతి


చింతలపూడి ఎత్తిపోతల పథకం డెలివరీ పాయింట్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: మెట్ట ప్రాంత అభివృద్ధికి బీజం వేశారు.. విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యతమిచ్చారు.. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన సాగునీటి వ్యవస్థను గాడిలో పెట్టే బృహత్తర ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. లక్షలాది ఎకరాలకు సాగునీరిచ్చి మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి అపర భగీరథుడిగా రైతుల హృదయాల్లో నిలిచిపోయారు దివంగతం ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. జిల్లాలో గిరిపుత్రులకు పోడుభూములకు పట్టాలిచ్చి సాగుదిశగా మళ్లించారు. ప్రతిష్టాత్మకమైన ఆరోగ్యశ్రీ పథకాన్ని ఏలూరులో ప్రారంభించి జిల్లాపై ఎనలేని అభిమానాన్ని చూపారు. ఆయన మరణించి ఏళ్లు గడుస్తున్నా జిల్లావాసుల మదిలో చిరస్మరణీయంగా నిలిచిపోయారు.

తమ్మిలేరు వరదలను అడ్డుకునేలా..

2004–2009 వైఎస్సార్ హయాంలో జిల్లాలో అభివృద్ధి పరుగులు తీసింది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు మోక్షం లభించింది. ఏలూరులో ముంపు సమస్యను తీర్చేలా 2005లో రూ.17 కోట్లతో తమ్మిలేరు రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన చేయగా 2024లో వైఎస్ జగన్ హయాంలో రూ.90 కోట్లతో పూర్తయ్యింది. ఉమ్మడి పశ్చిమలో నూజివీడులో ట్రిపుల్‌ఐటీ, తాడేపల్లిగూడెంలో హార్టికల్చర్ యూనివర్సిటీ, పోలవరం ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపనలు ఇలా కీలక ప్రాజెక్టులకు ఆయన హయాంలోనే అంకురార్పణలు జరిగాయి. జరిగాయి.

పోడుభూముల పంపిణీ : గిరిపుత్రులను వ్యవసాయం వైపు మళ్లించాలన్న ఉద్దేశంతో 2,200 మంది గిరిజనులకు 4,500 ఎకరాల పోడుభూములను పంపిణీ చేశారు. ఇప్పటికీ వేలాది మంది గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. మళ్లీ 15 ఏళ్ల తర్వాత వైఎస్ జగన్ హయాంలో 2,700 మంది గిరిజనులకు 3,500 ఎకరాల పోడు భూమిని పంపిణీ చేశారు.

ప్రాణదాత వైఎస్సార్



ముదినేపల్లికి చెందిన ఈ మహిళ పేరు నగడం రాములమ్మ. రోజువారి కూలి. 2007లో ఆమెకు ప్యాంక్రియాసిస్ వ్యాధి రాగా రూ.లక్షకు పైగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆమెకు ఆరోగ్యశ్రీ అపర సంజీవనిలా ఆదుకుంది. విజయవాడలోని కార్పొరేట్ ఆస్పత్రిలో ఆమెకు ఉచిత చికిత్స అందింది. అప్పటినుంచి తాను సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నానని, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనకు పునఃజన్మనిచ్చారని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానని ఆమె తెలిపింది.

చింతలపూడి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం

చింతలపూడి ఎత్తిపోతల పథకానికి వైఎస్సార్ హయాంలో శంకుస్థాపన చేశారు. పూర్వ కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 15 మెట్ట ప్రాంతా మండలాల్లో 2.10 లక్షల ఎకరాల సాగునీరు అందించే లక్ష్యంతో రూ.1,701 కోట్ల వ్యయంతో ప్రాజెక్టును ప్రారంభించారు. ఏజెన్సీ ముఖద్వారంగా ఉన్న జంగారెడ్డిగూడెంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇలా ప్రతి నియోజకవర్గంలో శాశ్వత రీతిలో నిలిచిపోయే కీలక అభివృద్ధి పనుల్లో రాజశేఖరరెడ్డి చెరగని ముద్ర వేశారు.

పోడు భూములకు పట్టాలిచ్చారు



నాకు 3.70 ఎకరాల పోడు భూమి ఉంది. పట్టాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగాను. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చలువతో అటవీహక్కుల చట్టంలో నా భూమికి పట్టా ఇచ్చారు. నాతోపాటు మా గ్రామంలో మరో 35 కుటుంబాలకు కూడా వైఎస్సార్ హయాంలో పోడుభూములకు పట్టాలిచ్చారు. ఆయన్ను మేం దేవుడిగా కొలుచుకుంటున్నాం.

– ఎం.రవిభాస్కర్, పోడు వ్యవసాయ రైతు, లక్ష్మీపురం, బుట్టాయగూడెం మండలం

ఇంటి నిర్మాణానికి సాయం



వైఎస్ రాజశేఖరరెడ్డి వల్ల నాకు ఎంతో మేలు చేకూరింది. మాది పెరికెగూడెం గ్రామం. నా పేరు పెరుమాళ్ల సత్యనారాయణ. నా భార్య పద్మ పెరికెగూడెం సర్పంచ్‌గా ఉంది. మాకు ఇద్దరు కుమారులు. మా ఇంటి నిర్మాణానికి రాజశేఖరరెడ్డి పాలనలో నాకు రూ.1.30 లక్షలు సాయం అందించారు. నాలా మా ఊరిలో చాలా కుటుంబాలు వైఎస్ రాజశేఖరరెడ్డి వల్ల లబ్ధి పొందాయి.

– పెరుమాళ్ల సత్యనారాయణ, పెరికెగూడెం, మండవల్లి మండలం

ట్రిపుల్‌ఐటీతో వెలుగు రేఖలు


నూజివీడులో ట్రిపుల్‌ఐటీ

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలో భాగంగా రాష్ట్రంలో మూడు ట్రిపుల్‌ఐటీలను ప్రారంభించారు. నూజివీడులో 120 ఎకరాల విస్తీర్ణంలో ఏటా 2 వేల అడ్మిషన్లతో అధునాతన భవనాలను ట్రిపుల్ ఐటీని ఏర్పాటుచేశారు. 6 వేల సీట్లతో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సును ఇక్కడ పేద పిల్లలు చదువుతున్నారు. సుమారు 5 వేల మందికి పైగా విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉన్నత కొలువులు సాధించారు. అలాగే ఎన్ఐటీ, ఐఐటీ, ఐఐఎస్‌లో అడ్మిషన్లతో పాటు గ్రూప్–2 మొదలు పంచాయతీరాజ్, ఇరిగేషన్‌లో ఇంజనీర్లుగా సేవలందిస్తున్నారు.

న్యూస్‌రీల్

విద్యారంగం నిర్వీర్యం


కలెక్టరేట్ వద్ద పీడీఎస్‌యూ నాయకుల ధర్నా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారంటూ పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ ప్రశ్నించారు. సోమవారం కలెక్టరేట్ వద్ద పీడీఎస్‌యూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భాస్కర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాకినాని, మహర్షి మాట్లాడుతూ పాఠశాల విలీన ప్రక్రియ వల్ల రాష్ట్రంలో వేలాది పాఠశాలలు మూతపడుతున్నాయన్నారు. రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీఓ 77ను ఎప్పుడు రద్దు చేస్తారని నిలదీశారు. పలు షరతులతో లక్ష మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి దూరమవుతున్నారన్నారు. సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో ఉన్నాయని, మెడికల్ కళాశాలలను తాకట్టు పెడుతున్నారని, నిరుద్యోగ భృతి అమలు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.45 లక్షల పోస్టులు భర్తీ చేయాలని నినదించారు.

మహిళా సంరక్షణ కార్యదర్శుల ఆవేదన


ఏఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులకు బదిలీల్లో అన్యాయం జరిగిందనీ, ఇష్టారాజ్యంగా బదిలీలు చేశారంటూ ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పలువురు మహిళా సంరక్షణ కార్యదర్శులు అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావును కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో చేపట్టిన బదిలీల్లో పారదర్శకత లోపించిందనీ, కౌన్సెలింగ్ నిర్వహించకుండా ఆప్షన్ ఫార్మ్‌లు తీసుకుని, తమకు నచ్చిన వారికి పోస్టింగులు ఇచ్చారంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సూపర్‌సిక్స్ అమలుచేయాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

చాట్రాయి: కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయడం లేదని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి డి.హరనాథ్ విమర్శించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, మండలంలో అటవీ భూముల సమస్యలు పరిష్కరించాలని, భూస్వాముల చేతిలో ఉన్న ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకోవాలని, ఉపాధి కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

పీఆర్‌సీ కమిటీని నియమించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారి సహనాన్ని పరీక్షిస్తోందని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ ప్రకటనలో తెలిపారు. మెరుగైన పీఆర్‌సీ ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పీఆర్‌సీనే కనుమరుగు చేశారని, పెండింగ్ ఉన్న బకాయిలు, సరెండర్ లీవ్‌లు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ విషయాల్లో ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. వెంటనే పీఆర్‌సీ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమానికి సన్నద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.

మెగా పేరెంట్స్ మీట్ తప్పనిసరి

ఏలూరు(మెట్రో): మెగా పేరెంట్స్ మీట్‌ను జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో కూడా తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో ఆమె సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్, జూనియర్ కళాశాల్లో మెగా పీటీఎం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

ధీమా ఇవ్వని బీమా

- ఉచిత పంటల బీమాకు తిలోదకాలు
- ప్రీమియం చెల్లించేందుకు రైతుల అవస్థలు
- ఇప్పటికీ అందని 'అన్నదాత సుఖీభవ'
- జిల్లాలో 99 వేల హెక్టార్లలో సాగు

ఏలూరు (మెట్రో): అన్నదాతకు కష్టాలు వెంటాడుతున్నాయి. గతంలో సాగు అంటే పండుగ అనేరీతిలో ప్రతి సీజన్‌ను ఉత్సాహంగా రైతులు మొదలు పెట్టేవారు. అయితే ప్రస్తుత కూటమి పాలనలో అడుగడుగునా ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమాతో రైతులకు అండగా నిలవగా.. ప్రస్తుత కూటమి సర్కారు ఉచిత పంటల బీమాకు మంగళం పాడింది. పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇప్పటికీ అమలు చేయలేదు. దీంతో సీజన్ ప్రారంభంలో పెట్టుబడులకు రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది. జిల్లాలో 99,515 హెక్టార్లలో రైతులు పలు పంటలు సాగుచేస్తున్నారు.

రైతులే చెల్లించాలని..

ప్రకృతి విపత్తుల సమయంలో రైతులను ఆదుకునేలా గత జగన్ సర్కారు ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. రైతుల తరపున బీమా ప్రీమియాన్ని ప్రభుత్వం చెల్లించేది. దీంతో రైతులకు భారం ఉండేది కాదు. అలాగే విపత్తుల సమయంలో నష్టపరిహారం సులభంగా అందేది. అయితే ప్రస్తుతం బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



రూ.25 కోట్ల మేర భారం

జిల్లాలో వరి, మినుములు, పత్తి, నిమ్మ పంటలకు ప్రీమియం చెల్లించేందుకు చివరి తేదీలు సైతం ప్రభుత్వం ఖరారు చేసింది. జిల్లాలో ఎకరా చొప్పున వరికి రూ.840, మినుముకు రూ.300, పత్తికి రూ.1,900, నిమ్మకు రు.2,500 చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. వరికి ఆగష్టు 15, మినుముకు జూలై 31, పత్తి, నిమ్మకు జూలై 15న చివరి తేదీగా గడువు విధించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బ్యాంకులో రైతులకు ఇచ్చే పంట రుణాల్లోనే ప్రీమియం సొమ్ము మినహాయించుకునేలా ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో సుమారు 99 వేల హెక్టార్లలో పలు రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. సుమారు 4.50 లక్షల మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. వీరిపై సుమారు రూ.25 కోట్ల మేరకు బీమా ప్రీమియం భారం పడనుంది.

వ్యవసాయం భారంగా మారింది



రైతులకు వ్యవసాయం భారంగా మారింది. ఇప్పటికీ పెట్టుబడి సాయం అందించకుండా కూటమి ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తోంది. గతంలో ఒక్క రూపాయి కూడా కట్టకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించి రైతులకు అండగా నిలిచింది. ప్రస్తుత కూటమి పాలనలో బీమా ప్రీమియం రైతులే చెల్లించాలనడం కష్టంగా ఉంది.

– వీరమాచినేని నాగబాబు, బాపిరాజుగూడెం

కౌన్సిల్‌లో ప్రొటోకాల్ పాటించేలా చూడాలి

వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి జేపీ వినతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల పట్ల ప్రొటోకాల్ పాటించడం లేదని, కౌన్సిల్‌లో మాట్లాడే అవకాశం కల్పించడం లేదని, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) ఆధ్వర్యంలో కార్పొరేటర్లు కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం సమర్పించారు. జేపీ, కార్పొరేటర్లు మాట్లాడుతూ ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో నిబంధనలు పాటించలేదని ఆరోపించారు. ప్రజాసమస్యలు చర్చించకుండా అడ్డుకుంటున్నారని, చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశాల్లో కో–ఆప్షన్ సభ్యులు మాట్లాడేందుకు అనుమతి లేకపోయినా సభా మర్యాద పాటించకుండా ప్రతిపక్ష సభ్యులను టార్గెట్ చేసుకుని విమర్శలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి స్థానిక కార్పొరేటర్లకు కనీస సమాచారం ఇవ్వడం లేదని వీటిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు గుడిదేశీ శ్రీనివాసరావు, నెరుసు చిరంజీవులు, గంట మోహన్‌రావు, మున్నుల జాన్ గుర్నాథ్, నూకపెయ్యి సుధీర్ బాబు, తుమరాడ స్రవంతి, జి.విజయనిర్మల, కేదారేశ్వరి డింపుల్ తదితరులు ఉన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి జయప్రకాష్, పార్టీ నాయకులు

రెయిలింగ్‌కు అనుమతివ్వాలి

ఏలూరులోని ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో 2010లో ఏర్పాటు చేసిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద గ్రానైట్, రెయిలింగ్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని పార్టీ ఇన్‌చార్జి జయప్రకాష్ (జేపీ) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. 2023లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో విగ్రహం చుట్టూ అభివృద్ధి పనులు, రెయిలింగ్ పనులు మొదలుపెట్టారని, అయితే అనివార్య కారణాల వలన పనులు నిలిపివేశారన్నారు. దీంతో వైఎస్సార్ అభిమానులు విగ్రహం వద్ద కార్యక్రమాలు నిర్వహించినప్పుడు ఇబ్బంది పడుతున్నారన్నారు. విగ్రహం వద్ద గ్రానైట్, రెయిలింగ్ పనులు చేయించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

394 అర్జీల స్వీకరణ

ఏలూరు(మెట్రో): ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 394 అర్జీలు స్వీకరించారు. సమస్యలకు పెండింగ్ లేకుండా పరిష్కారం చూపాలని ఆదేశించారు. జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓ ఎం.అచ్యుత అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని.. ఉంగుటూరు మండలం తల్లాపురానికి చెందిన తోట జయరాజు తన వ్యవసాయ భూమి ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేశారు.

- ఏలూరు చేపల తూము సెంటర్‌కు చెందిన దొరమంగ తన భర్త మతిస్థిమితం లేక అదృశ్యమయ్యారని, ఆయన జాడ తెలుసుకోవాలని, తమ కుటుంబ పరిస్థితి దృష్ట్యా పింఛన్ ఇప్పించాలని కోరారు.
- దెందులూరు మండలం కొవ్వలికి చెందిన కుందేటి సరోజిని తన భర్త చనిపోయి రెండేళ్లయ్యిందని, తనకు వితంతు పింఛన్ ఇప్పించాలని కోరారు.
- పెనుగొండ మండలం ముళ్లపర్రుకి చెందిన దివ్యాంగుడు కేసరి చిట్టిబాబు తనకు 3 చక్రాలు బ్యాటరీ వాహనం మంజూరు చేయాలని కోరారు.
- ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడేనికి చెందిన పితాని పుణ్యవతి తన ముగ్గురు కుమారులు ఆస్తి రాయించుకుని, వృద్ధాప్యంలో తనను చూడటం లేదని చర్యలు తీసుకోవాలని అర్జీ అందించారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత ప్రభుత్వం అందించే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జిల్లాలో ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఈనెల 15 వరకు గడువు ఉందని, షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థుల వివరాలు ఆగస్టు 5,6 తేదీల్లో వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారని, 7 నుంచి 12వ తేదీ మధ్య తుది ఎంపిక ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ఇండిపెండెంట్ జ్యూరీ తుది ఎంపిక చేసిన అభ్యర్థుల పేర్లను ఆగస్టు 13న వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులు సాధారణంగా అర్హులు కారని, అయితే సంబంధిత సంవత్సరంలో కనీసం నాలుగు నెలలు విధులు నిర్వహించిన వారు (ఏప్రిల్ 30 వరకు) ఇతర అర్హతలన్నీ పూర్తిగా ఉంటే అవార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ వెంకటలక్ష్మి పేర్కొన్నారు.

సామాన్యులకు వెజిట్రబుల్స్

గణపవరం: కూరగాయల ధరలు సామాన్యులను కంగారు పుట్టిస్తున్నాయి. కిలో ఉల్లి రూ.20 నుంచి రూ.50కు చేరి కన్నీళ్లు తెప్పిస్తోంది. ఇదే బాటలో మిగిలిన కూరగాయల ధరలు ఉన్నాయి. సోమవారం గణపవరం సంతలో కిలో ధరలు ఇలా ఉన్నాయి. ఉల్లి రూ.40 నుంచి రూ.50, పచ్చిమిర్చి రూ.70, బీర రూ.60, వంకాయలు రూ.60, బెండ రూ.50, క్యారెట్ రూ.50, బీట్‌రూట్ రూ.50, దోస రూ.30, దొండ రూ.40, కాకర రూ.60, ఆకాకర రూ.80, కీరదోస రూ.80, కంద రూ.50, చిక్కుడు రూ.120, టమాట రూ.60, అల్లం రూ.120, మునగ రూ.10, ఆనబ రూ.30, బీన్స్ రూ.80, క్యాప్సికం రూ60, క్యాబేజీ రూ. 50, కాలిఫ్లవర్ రూ.50 చొప్పున పలికాయి. ఆకుకూరలు ధరలు అదేబాటలో ఉన్నాయి. తోటకూర, గోంగూర, పాలకూర, చుక్కకూర తదితర రకాలు కట్ట రూ.20 చొప్పున విక్రయించారు.


గణపవరం సంతలో కూరగాయల దుకాణం

పీపీలకు ల్యాప్‌టాప్‌లు


పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్: జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సోమవారం ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ చేతులమీదుగా ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ న్యాయవ్యవస్థలో మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ప్రభుత్వం ల్యాప్‌టాప్‌లు అందించిందన్నారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా న్యాయస్థానాల్లోని పీపీలు, ఏపీపీలకు ల్యాప్‌టాప్స్ అందజేశామన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తహసీల్దార్‌కు వీఆర్‌ఏల సమ్మె నోటీసులు



తహసీల్దార్‌కు సమ్మె నోటీస్ అందిస్తున్న వీఆర్‌ఏలు

కుక్కునూరు: ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటునట్లు వీఆర్‌ఏలు సోమవారం కుక్కునూరు తహసీల్దార్‌కు నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలనం రూ.10 వేల వేతనంతో జీవితాలను నెట్టుకొస్తున్న వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని, పనిభారం తగ్గించాలని, జీతాలు పెంచాలని, లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, వీఆర్‌ఏ యూనియన్ అధ్యక్షుడు పోచారపు వెంకన్నబాబు, కురాకుల మోహన్‌రావు, వీఆర్‌ఏలు ఇరకం సుజాత, వర్క శివ, శేఖర్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే 3 రోజులు భారీ వర్షాలు

ఏలూరు(మెట్రో): గోదావరి బేసిన్‌లో రాబోయే 3 రోజులు భారీ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ, జలవనరుల శాఖల అంచనా మేరకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను అప్రమత్తం చేశారు. ప్రస్తుత అంచనా ప్రకారం సర్దార్ కాటన్ బ్యారేజీలో ఈనెల 12వ తేదీ నాటికి 9 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు చేరే అవకాశం ఉందనీ జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ చెబుతున్నారని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలి

రాష్ట్ర, జిల్లా ఆర్థిక పురోగతికి దోహదపడే వ్యవసాయ అనుబంధ రంగాలపై పూర్తి దృష్టి పెట్టాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్, మైక్రోఇరిగేషన్, అన్నదాత సుఖీభవ, సీసీఆర్‌సీ కార్డులు, ఈ పంట, ఎరువుల పంపిణీ, మామిడి పంట, పంటల బీమా, వ్యవసాయ ఆధునీకరణ యంత్రాలు తదితర అంశాలపై కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించి అధికారులకు దిశా, నిర్దేశం చేశారు.

ట్రిపుల్ ఐటీలో కొరవడిన భద్రత

- శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థుల హాస్టల్ గదుల లూటీ
- పలు రూమ్‌ల తాళాలు పగులగొట్టి, గదులు విరగ్గొట్టి చోరీ
- విద్యార్థులు వేసవి సెలవులకు వెళ్లి వచ్చాక వెలుగు చూసిన వైనం



ఐ1 హాస్టల్ భవనం

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో భద్రత కొరవడింది. ట్రిపుల్ ఐటీలోని శ్రీకాకుళం ఇంజినీరింగ్ విద్యార్థులు ఉంటున్న ఐ1 హాస్టల్ భవనంలోని మూడో అంతస్తులో ఉన్న హాస్టల్ గదులను ఆగంతకులు లూటీ చేశారు. ఇంజినీరింగ్ తృతీయ సంవత్సర విద్యార్థులు వేసవి సెలవులకు వెళ్లి జూలై ఐదో తేదీ నుంచి తిరిగి రావడంతో హాస్టల్ గదుల్లో చోరీ జరిగిన విషయం వెలుగు చూసింది.

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి చెందిన ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం, మూడో సంవత్సరం విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్ ఐటీలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఐ1 హాస్టల్ వసతి గృహంలోని రెండో ఫ్లోర్‌లో నాలుగో సంవత్సరం విద్యార్థులు, మూడో అంతస్తులో తృతీయ సంవత్సర విద్యార్థులు ఉంటున్నారు. మే 15 నుంచి వేసవి సెలవులు ఇవ్వడంతో ఈ4 విద్యార్థులు తమ సామగ్రినంతా తీసుకొని హాస్టల్ గదులను ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఈ3 విద్యార్థులు మాత్రం తమ దుస్తులను, ట్రాలీ బ్యాగ్‌లను, పుస్తకాలను, షూలను ఇతర సామగ్రిని తమ గదుల్లోనే ఉంచి తాళాలు వేసుకొని ఇళ్లకు వెళ్లారు. అయితే ఈ విద్యాసంవత్సరం నుంచి ఈ4 విద్యార్థులకు తరగతులు శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోనే నిర్వహిస్తున్నామని, నూజివీడులో ఈ3 పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ శ్రీకాకళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు వచ్చేయాలని ట్రిపుల్ ఐటీ అధికారులు ఫోన్‌లకు మెసేజ్‌లు పెట్టారు. దీంతో వారంతా తమ సామగ్రిని తీసుకెళ్లేందుకు నూజివీడు ట్రిపుల్ ఐటీకి వచ్చి తమ రూమ్‌లకు వెళ్లగా తాళాలు పగులగొట్టి, లోపలి దుస్తులను, పుస్తకాలను చిందరవందరగా పడేసి ఉండటం చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. మూడో అంతస్తులో దాదాపు 100 గదులు ఉండగా 30 గదుల వరకు తాళాలు పగులగొట్టి, గదులు పగుల గొట్టి విద్యార్థుల పుస్తకాలను, దుస్తులను చిందరవందరగా పడేయడంతో పాటు సూట్‌కేసులు, ట్రాలీ సూట్‌కేసులు, కొందరి ల్యాప్‌ట్యాప్‌లు, విద్యార్థుల బూట్లు చోరీ చేశారు. ఇంత పెద్ద ఎత్తున లూటీ జరిగినా సమాచారం బయటకు పొక్కకుండా ట్రిపుల్ ఐటీ అధికారులు అది విషయమే కానట్లుగా వ్యవహరిస్తున్నారు. తమ గదుల్లోని వస్తువులు చోరీకి గురికావడంపై విద్యార్థులు మెయిల్ ద్వారా యూనివర్సిటీ ఛాన్సలర్ దృష్టికి సైతం తీసుకెళ్లారు. హాస్టల్ గదులకు కూడా భద్రత లేకపోతే ఎలాగని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.



విద్యార్థుల హాస్టల్ గదుల్లో చెల్లాచెదురుగా పడేసిన దుస్తులు



తలుపు వద్ద తాళం రాకపోయే సరికి గడిని ఊడగొట్టిన ఆగంతకులు

సెక్యూరిటీ వ్యవస్థ నిద్రపోతోందా..!

ట్రిపుల్ ఐటీలో 24 గంటలూ సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. షిఫ్టుకు 55 మంది చొప్పున మూడు షిప్టులు విధుల్లో ఉంటారు. అలాగే హాస్టల్ భవనంలో నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన కేర్ టేకర్, శ్రీకాకుళంకు చెందిన కేర్ టేకర్‌లు విధుల్లో ఉంటారు. హాస్టల్ భవనం వద్ద సైతం 24 గంటలూ సెక్యూరిటీ సిబ్బంది కాపలా కాస్తూ ఉంటారు. అంతేగాకుండా ట్రిపుల్ ఐటీలో పోలీస్ అవుట్‌పోస్టు సైతం ఉంది. అయినప్పటికీ విద్యార్థుల రూమ్‌ల తాళాలు పగులగొట్టి, గదులను విరగ్గొట్టి చోరీలకు పాల్పడటం సంచలనంగా మారింది. గతంలో రెండు సార్లు ఫ్యాకల్టీ గృహాల్లో సైతం దొంగతనాలు జరిగాయి. వాటికి సంబంధించి దర్యాప్తు ఇంత వరకు అతీగతీ లేదు. ఇప్పుడు తాజాగా విద్యార్థుల హాస్టల్ గదుల్లో జరగడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా చోరీకి పాల్పడిన వారు ఎవరో నిగ్గు తేల్చాల్సిన బాధ్యత యాజమాన్యం పైన, పోలీసులపైనా ఉంది.

మదినిండా పెద్దాయనే..



మైక్రోఆర్టిస్ట్ సురేష్ సృజనతో అగ్గిపుల్లపై వైఎస్ చిత్రం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముఖ్యమంత్రిగా, ప్రజానేతగా వైఎస్ రాజశేఖర రెడ్డి అందించిన సేవలు ఇప్పటికీ ప్రజల హదయాల్లో పదిలమే. అందుకే ఆయన్ను రాష్ట్రమంతా పెద్దాయనగా పిలుచుకుంటుంది. ఆ మహనీయుడి జయంతి సందర్భంగా నగరానికి చెందిన మైక్రో ఆర్టిస్టులు తమ కళ ద్వారా వైఎస్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఏలూరుకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ ప్రసాద్ వైఎస్ చిత్రపటాన్ని రావి ఆకుపై చిత్రించి తన అభిమానాన్ని చాటుకోగా, మరో మైక్రో ఆర్టిస్ట్ మేతర సురేష్ అగ్గిపుల్లపై వైఎస్ చిత్రాన్ని చిత్రించి కృతజ్ఞత చాటుకున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఎందరికో ప్రాణభిక్ష పెట్టడమే కాకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద విద్యార్థులు ఉన్నత చదువులకు కృషి చేసిన మహామనిషి వైఎస్సార్ అని మైక్రో ఆర్టిస్టులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

కుమార్తె అదృశ్యంపై పిర్యాదు

ముదినేపల్లి రూరల్: కుమార్తె అదృశ్యంపై ఆమె తల్లి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకరరావు తెలిపారు. మండలంలోని చిగురుకోట శివారు నరసన్నపాలెంకు చెందిన మహిళ తన కుమార్తె పదో తరగతి వరకు చదువుకుని కూలి పనులకు వెళుతుందని, సోమవారం తెల్లవారుజాము నుంచి కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వైఎస్ పాలనలో ఏజెన్సీలో అభివృద్ధి పరుగులు



దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి ఏజెన్సీ సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు (ఫైల్)

బుట్టాయగూడెం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి పరుగులు పెట్టిందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం సాయంత్రం దుద్దుకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్సార్‌తో ఆయనకున్న అనుబంధం, వైఎస్సార్ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమై డ్రాప్‌ఔట్స్‌గా మిగులుతున్న సమయంలో జూనియర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేసి ఉన్నత విద్యల్లో ముందుకు సాగే విధంగా వైఎస్ కృషి చేశారన్నారు. అదేవిధంగా నియోజకవర్గ స్థాయిలో 70 వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించిన ఘనత వైఎస్సార్‌దే అని అన్నారు. 400 కిలోమీటర్ల మేర బీటీ రోడ్ల నిర్మాణానికి కృషి చేసి రహదారుల సమస్య లేకుండా చేశారన్నారు. అదే విధంగా అటవీ హక్కుల చట్టంలో సుమారు 10 వేల ఎకరాలకు పైగా భూములను పేదలకు వైఎస్సార్ పంచడం జరిగిందని గుర్తుచేశారు. రూ. 26 కోట్ల వ్యయంతో గిరిజనుల బీడు భూములకు సాగు నీరు అందించే విధంగా పోగొండ రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి ఏటా కొండ కాలువల ప్రవాహానికి అనేక మంది గిరిజనులు మృతి చెందుతుంటే వాటిని నివారించేందుకు రూ.26 కోట్లతో నాలుగు ప్రదేశాల్లో హైలెవెల్ బ్రిడ్జిల నిర్మాణానికి కృషి చేశారన్నారు.

వైఎస్ చలువతోనే పోలవరం ప్రాజెక్టు

పోలవరం మండలంలో ప్రతి ఏటా గోదావరి వరదనీరు ప్రవాహానికి 50 వేల ఎకరాల పంట భూములు ముంపునకు గురై రైతులు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. దీంతో చిరకాల స్వప్నమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వైఎస్ చలువతోనే ప్రారంభమైందని చెప్పారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సుమారు రూ.70 కోట్లతో కొవ్వాడ ఔట్ పాల్స్ క్లూయిస్ పనులకు శ్రీకారం చుట్టారని చెప్పారు. అలాగే గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని 5 ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు జంగారెడ్డిగూడెంలో 100 పడకల నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. ఇలా వైఎస్సార్ పాలనలో తాము ఏ సమస్య అయినా దరఖాస్తు రూపంలో అందజేస్తే వెనువెంటనే నిధులు మంజూరు చేసేవారని చెప్పారు. నాడు వైఎస్సార్ చేసిన అభివృద్ధి పనులను చూసి రాజశేఖరరెడ్డిని దేవుడిగా కొలుచుకుంటున్నారని చెప్పారు. మళ్లీ అదే రీతిలో తండ్రి బాటలో పాలన చేస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని చెప్పారు.

నిట్‌లో సీట్లు ఫుల్

- ఆరో రౌండ్ తర్వాత చేరికలు
- ఎంటెక్ తరగతులు త్వరలో ప్రారంభం
- హెఫా నిధుల కోసం నిరీక్షణ



ఏపీ నిట్

తాడేపల్లిగూడెం: జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ (జోసా) పర్యవేక్షణలో జాతీయ విద్యాసంస్థలైన నిట్ తదితర సంస్థల్లో సీట్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు రెండు రౌండ్లు ముగియగా మరో ఆరు రౌండ్లు మిగిలాయి. తొలి విడతలోనే ఏపీ నిట్‌లో ఉన్న 480 సీట్లకు ఆప్షన్లను విద్యార్థులు ఎంపిక చేసుకున్నారు. మొదటి రౌండ్‌లోనే సీట్లు భర్తీ అయ్యాయి. నిట్‌లో ఉన్న ఎనిమిది బ్రాంచిలలో చేరడానికి విద్యార్థులు ఫ్లోట్ (బ్రాంచి మారడానికి వీలుగా) ఫ్రీజింగ్ (సీటు నిర్ధారణ చేసుకోవడం)వంటి ఐచ్ఛికాలను ఎంపిక చేసుకున్నారు. హోమ్ స్టేట్ కోటా కింద 240 మంది, అదర్ స్టేట్ కోటా కింద 240 మంది ఆప్షన్లను ఎంపిక చేసుకోగా, మిగిలిన నాలుగు రౌండ్లు ముగిసిన తర్వాత వెరిఫికేషన్ కేంద్రాల్లో జోసా నుంచి తుది జాబితా వచ్చిన తర్వాత సర్టిఫికెట్లను పరిశీలన చేసిన తర్వాత నిట్‌లో విద్యార్థులు చేరే ప్రక్రియ పూర్తి కానుంది. తర్వాత ఇండక్షన్, తరగతుల ప్రారంభం కార్యక్రమాలు జరగాల్సి ఉంది. ఆగస్టు నెల వరకు విద్యార్థులు ప్రాంగణానికి వచ్చే అవకాశాలు లేవు.

ఎంటెక్ సీట్ల భర్తీ ప్రక్రియ షురూ

కొంతకాలం విరామం తర్వాత ఏపీ నిట్‌లో ఎంటెక్ కోర్సు ప్రారంభం కానుంది. ఎంటెక్ కోర్సులో ఇక్కడ 99 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించే ప్రక్రియ ప్రారంభమైంది. వంద సీట్లు పైన ఉంటేనే ఆయా నిట్‌కు వెరిఫికేషన్ సెంటర్ ఇస్తారు. ఏపీ నిట్‌లో 99 సీట్లు ఉండటంతో ఇక్కడకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిట్ రాయపూర్‌లో ఏర్పాటుచేశారు.

హెఫా నిధుల కోసం నిరీక్షణ

ఏపీ నిట్‌లో రెండోదశ పనుల కోసం రూ.430 కోట్ల ప్రతిపాదనతో కెనరా బ్యాంకు ద్వారా హైర్ ఎడ్యుకేషన్ ఫండింగ్ ఏజెన్సీ(హెఫా) నుంచి నిధుల కోసం కేంద్ర ఉన్నత విద్యాశాఖకు వినతులు పంపారు. ఏపీ నిట్‌కు బోర్డు ఆఫ్ గవర్నెన్సు(బీఓజీ) చైర్మన్ లేకపోవడం, పాత చైర్‌పర్సన్ పదవీకాలం ముగిసి ఏడాది గడుస్తున్నా , ఇంకా ఆ స్థానంలో చైర్మన్ ఎంపిక జరుగలేదు. నిధుల్లో కదలిక లేకపోవడానికి ఇది ఒక కారణంగా తెలుస్తోంది.

ట్రిపుల్ ఐటీలో చోరీ యాజమాన్య వైఫల్యమే

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నూజివీడు ట్రిపుల్ ఐటీలో చోరీ పూర్తిగా యాజమాన్య వైఫల్యమేనని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కే లెనిన్ విమర్శించారు. స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూజివీడు పట్టణంలో ఉన్న ట్రిపుల్ ఐటీ కళాశాల విద్యార్థులు మే నెలలో సెలవులకు వెళ్లి ఈనెలలో తిరిగి రాగా వారికి కేటాయించిన బ్లాక్ ఐ మూడవ అంతస్తులో దాదాపు 80 రూముల్లో చోరీ జరిగినట్లు తమ దృష్టికి తీసుకువచ్చిందన్నారు. విద్యార్థుల దుస్తులు, బూట్లు, ల్యాప్‌టాప్‌లు, ట్రాలీ బ్యాగులు చోరీ అయ్యాయని, దీనిపై ఈనెల 4న కొందరు విద్యార్థులు కళాశాలకు రాగానే పరిస్థితి చూసి మేనేజ్‌మెంట్‌కి మెయిల్ పెట్టగా తాము పరిశీలిస్తామని చెప్పారన్నారు. దీనిపై చర్యలు తీసుకోకపోగా ఈనెల 12వ తేదీకల్లా విద్యార్థులను రూమ్ ఖాళీ చేసి వెళ్లిపోమనడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఐటీలో నిర్వహణ లోపం ఉందని, వెంటనే విద్యార్థుల వస్తువులు ఎవరు తీసుకెళ్లారో విచారణ చేసి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.శివ, ఎస్.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ జేఏఓలకు పదోన్నతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో పని చేస్తున్న పలువురు జూనియర్ అక్కౌంట్స్ అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెంలో జూనియర్ అక్కౌంట్స్ అధికారిగా పని చేస్తున్న సీహెచ్ శ్రీనివాసరావుకు అసిస్టెంట్ అక్కౌంట్స్ అధికారిగా పదోన్నతి కల్పించి నిడదవోలుకు బదిలీ చేశారు. అలాగే తాడేపల్లిగూడెంలో జూనియర్ అక్కౌంట్స్ అధికారిగా పనిచేస్తున్న టీ వెంకాయమ్మకు అసిస్టెంట్ అక్కౌంట్స్ అధికారిగా పదోన్నతి కల్పించి ఆమెను ఏలూరు విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి బదిలీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

యలమంచిలి: లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి చెందాడు. వివరాల ప్రకారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం రామరాజులంక గ్రామానికి చెందిన మేడిచర్ల పూర్ణచంద్ర ఉదయభాస్కర్ (64) తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం చించినాడ వచ్చి తిరిగి బైక్‌పై వెళ్తుండగా చించినాడ వశిష్ఠ గోదావరి నది వంతెనపై సిమెంట్ లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో భాస్కర్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భాస్కర్ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రయ్య వివరించారు.

హత్య కేసులో 8 మంది అరెస్ట్

దెందులూరు: మండలంలోని వీరభద్రపురం వద్ద ఇటీవల జరిగిన హత్య కేసులో 8 మందిని పెదవేగి సీఐ రాజశేఖర్ అరెస్ట్ చేసినట్లు దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. 8 మంది నిందితులను భీమడోలు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్సై చెప్పారు.

నాటుసారా కేంద్రాలపై దాడులు



బెల్లం ఊటను పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కుక్కునూరు: మండలంలోని నాటుసారా తయారీ కేంద్రాలపై సోమవారం జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో సీతారామనగరం గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కే శ్రీనుబాబు తెలిపారు. అంతేకాక మండలంలోని మారేడుబాక, శ్రీధరవేలేరు గ్రామాల్లో సారా వలన దుష్ఫలితాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని గిరిజనుడి మృతి

వేలేరుపాడు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని గిరిజన యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామవరం గ్రామానికి చెందిన మడకం ప్రకాష్ మొహర్రం (పీర్లపండుగ)ను పురస్కరించుకొని సోమవారం మధ్యాహ్నం కన్నాయిగుట్ట గ్రామానికి తన ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. వేలేరుపాడు మండల పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా తలకు తీవ్ర గాయమైంది. వైద్యం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ప్రకాష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వేలేరుపాడు ఎస్సై నవీన్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్ట్

గుడివాడ రూరల్: అంతర్ జిల్లాల దొంగల ముఠాను పామర్రు, గుడివాడ సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22న పామర్రు మండలం మలయప్పన్‌పేటలో నివాసముంటున్న సాలిమట్టి ప్రమీలరాణి ఇంట్లో సుమారు రూ.5 లక్షలు విలువైన 16 కాసుల బంగారు నగలతో పాటు సెల్‌ఫోన్‌ను రాత్రి ఐదుగురు వ్యక్తులు దొంగతనం చేశారు. దీనిపై పామర్రు సీఐ వి.సుభాకర్, ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్ రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్లు, సిగ్నల్స్ ఆధారంగా సీసీ కెమెరాల్లోని ఆధారాలతో వాహనాలతో పారిపోయిన దొంగలను గుర్తించారు. ఈ ఏడాది ఏప్రిల్ 8న కాకినాడకు చెందిన కొటారి శ్రీనివాస్(36), గుడివాడ నైజాంపేటకు చెందిన తిరుమలశెట్టి ధనుష్(పాండు 18), బేతవోలుకు చెందిన ప్రత్తిపాటి సంజయ్(19)లను అదుపులోకి తీసుకోగా.. ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ షబ్బీర్(19)ని మార్చి 25వ తేదీన, ఏలూరుకు చెందిన ఎస్‌కే మున్న అలియాస్ సిరి(19, ట్రాన్స్‌జెండర్)లను ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. బాధితులు పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌ను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ చోరీలకు పాల్పడుతున్నవారిపై విజయవాడ, ఏలూరు జిల్లా కైకలూరు, పశ్చిమ గోదావరి జిల్లా, చిత్తూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లో 110 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

జైలులో స్నేహం..

ఈ కేసులో అదుపులోకి తీసుకున్న ఐదుగురు నిందితులకు గుడివాడకు చెందిన గొడవర్తి కిరణ్ అలియాస్ లిక్క గంజాయి వ్యాపారం చేస్తూ పట్టుబడి జైలుకి వెళ్లిన క్రమంలో మిగిలిన వారితో స్నేహం ఏర్పడిందని డీఎస్పీ వివరించారు. వీరందరూ కలసి గుడివాడలో మద్యం, గంజాయి తాగేందుకు వచ్చి ఈ చోరీలకు పాల్పడినట్లు తమ దర్యాప్తులో వెల్లడైందన్నారు. అదుపులోకి తీసుకున్న నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

పుణ్యక్షేత్రాల వైపు ఆర్టీసీ అడుగులు

- అరుణాచలంకు ప్రత్యేక బస్సులు
- సప్త మాతృకాదర్శనం పేరుతో ప్రత్యేక ప్యాకేజీలు

నూజివీడు: ఏపీ ప్రజా రవాణా సంస్థ(ఆర్టీసీ) ఆదాయం పెంచుకునే మార్గంలో పుణ్యక్షేత్రాల వైపు అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగానే ప్రముఖ పుణ్యక్షేత్రాలకు బస్సు సర్వీసులను నడిపేందుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే ఏలూరు జిల్లాలోని ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోల నుంచి తమిళనాడులోని అరుణాచలంకు బస్సు సర్వీసులను నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం ఆషాఢ మాసం గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఈ బస్సులు ఈనెల 8న సాయంత్రం 6గంటలకు బయలుదేరి 9వ తేదీ ఉదయం శ్రీకాళహస్తిలోని దక్షిణామూర్తి, శ్రీకాళహస్తీశ్వర వాయులింగం దర్శనం, జ్ఞాన ప్రసూనాంబ దర్శనం అనంతరం కాణిపాకంలోని వినాయకుడి దర్శనం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం అరుణాచలం చేరుకుంటుంది. ఈనెల 10న ఉదయం గిరి ప్రదక్షిణ చేసి అరుణాచలేశ్వర దర్శన అనంతరం కంచిలోని కామాక్షి అమ్మవారిని దర్శించుకున్న తరువాత గమ్యస్థానానికి చేరుకుంటారు. ఈ టూర్‌కు ఒక్కొక్కరికి రూ.3వేలు టిక్కెట్‌తో పుష్ బ్యాక్ సీట్లతో బస్సులను ఏర్పాటు చేశారు.

సప్తమాతృకాదర్శనం

అలాగే ప్రతి ఆదివారం ఏడుగురు అమ్మవార్లను దర్శించుకునేలా సప్తమాతృకాదర్శనం పేరుతో ఆర్టీసీ యాత్రను ఏర్పాటు చేసింది. ఉదయం 4 గంటలకు బయలుదేరి ఏడుగురు అమ్మవార్లను దర్శించుకొని తిరిగి రాత్రికల్లా తిరిగి వస్తారు. కొల్లేటి పెద్దింటమ్మ, భీమవరం మావుళ్లమ్మ, పెనుగొండ వాసవీమాత, కోట సత్తెమ్మ తల్లి, ద్రాక్షారామం మాణిక్యాంబ, పిఠాపురం పురుహూతిక మాత, పెద్దాపురం మరిడమ్మ అమ్మవారులను దర్శించుకుంటారు. 36 మంది ఒకే ప్రదేశం నుంచి ఉంటే ప్రత్యేక ప్యాకేజీపై బస్సును ఏర్పాటు చేయనున్నారు. మూడు డిపోలలో ఎక్కడి నుంచైనా మనిషి ఒక్కరికి రూ.800 మాత్రమే చార్జి చెల్లిస్తే సరిపోతుంది. ఆసక్తి కలిగి వారు సమీపంలోని డిపోమేనేజర్‌ను గాని ఏలూరు 93467 67670, జంగారెడ్డిగూడెం 94910 19105, నూజివీడు 73829 01757 నంబర్లలోని సంప్రదించాలని నూజివీడు ఇన్‌చార్జి డీఎం జీ రాంబాబు కోరారు.

దాడి ఘటనలో 10 మందిపై కేసు నమోదు

కైకలూరు: వ్యక్తిపై దాడి ఘటనకు సంబంధించి పది మందిపై కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు మండలం వదర్లపాడు గ్రామానికి చెందిన ఘంటసాల సురేష్(38) మరో నలుగురితో కలిసి శనివారం సాయంత్రం అమ్మవారి దర్శనం అనంతరం సర్కారు కాల్వ వంతెనపై సెల్ఫీ దిగుతున్నారు. అక్కడ భీమవరంనకు చెందిన యువకులతో వివాదం ఏర్పడింది. చివరకు సురేష్ తన కారులో ఆలపాడు పెట్రోల్ బంకు వరకు వచ్చాడు. ఇంతలో అంతకు ముందే భీమవరంనకు చెందిన మరో రెండు కార్లలో వచ్చిన 10 మంది సురేష్‌ను తీవ్రంగా కొట్టారు. కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేష్ ఫిర్యాదుపై రూరల్ ఎస్సై వి.రాంబాబు కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుడి అరెస్ట్

భీమవరం: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణంలోని మునిసిపల్ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ సోమవారం చెప్పారు. ఉపాధ్యాయుడ్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.